క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాలు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వివిధ మండపాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ ఊరేగింపుతో స్వామి వారిని గంగ ఒడికి చేర్చారు. మధ్యాహ్నం పలు మండపాల్లో అన్న సమారాధనలు చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయ ప్రకాష్ గృహంలో ఆదివారం గణపతి హోమం, వినాయకపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్థానిక సత్రంపాడులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామి వారికి విశేష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వివిధరకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈఓ సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు

గణపవరం: అన్ని వర్గాల ప్రజలు సమానమని, అందరూ కలిసిమెలిసి జీవించాలని, ఎవరైనా కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం వెలగపల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ అధ్యక్షతన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించినా, కించపరిచినా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పౌరహక్కుల కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు

గణపవరం: గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని, ఏలూరు జిల్లాలో కలపొద్దని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గణపవరం నుంచి అఖిలపక్ష నాయకులు ఆదివారం భీమవరం వెళ్లి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. పాతపాటి హరికుమార్‌రాజు, నంద్యాల రామలింగరాజు పాల్గొన్నారు.

తమ్మిలేరు లాకుల నిర్వహణలో నిర్లక్ష్యం

ఏలూరు (టూటౌన్): తమ్మిలేరు లాకుల నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుంది. గతంలోనే తమ్మిలేరు తూర్పు, పడమటి లాకుల వద్ద కొన్ని చోట్ల షట్టర్లు పాడైపోవడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలు అడ్డు వేసి మమ అనిపించారు. అప్పట్లోనే పాడైన షట్టర్లతో దిగువకు వరద నీరు ప్రవహించేనా అంటూ సాక్షి పత్రికలో కథనం కూడా వచ్చింది. ముందుగా ఊహించినట్లుగానే ఇటీవల వర్షాలకు తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ సమయంలో దిగువ కొల్లేరులోకి వరద నీరు సాఫీగా వెళ్లకుండా పాడైన షట్టర్ల వద్ద నీటి ప్రవాహం ఆగిపోతుంది. దీంతో అధికారులు హడావుడిగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అధికార యంత్రాంగం ముందే మేల్కొంటే ఈ సమస్య తప్పేది కదా అంటూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

పాడైన గేట్లతో ఇక్కట్లు

తమ్మిలేరు లాకుల వద్ద పాడైన గేట్లతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏలూరు నగరానికి రెండు వైపులా ఇటు పడమర వైపు, అటు తూర్పువైపు విస్తరించి ఉన్న తమ్మిలేరు ద్వారా వచ్చే వర్షం,వరద నీరు లాకుల ద్వారా దిగువ కొల్లేరులోకి వెళ్లాల్సి ఉంది. గతంలో ఇటు తూర్పు లాకుల వద్ద పెద్ద మొత్తంలో సిల్ట్, చెత్త పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా తయారైంది. అదే విధంగా సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో ఉన్న పడమర లాకుల వద్ద కొన్ని చోట్ల గేట్లు పాడైపోయి ఉన్నాయి. పాడైపోయిన స్థానంలో తాత్కాలికంగాం ఇసుక బస్తాలు అడ్డు వేసి ఉంచారు. అంతేగానీ పాడైపోయిన గేట్లను బాగు చేసిన దాఖలాలు లేవు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున వచ్చే వరద దిగువ కొల్లేరుకు సాఫీగా వెళ్ళేందుకు అవకాశం ఉంటుందా? అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్త, చెదారం , జంతు కళేభారాలు వేస్తుండటంతో పాటు తమ్మిలేరు నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం కూడా మరో కారణంగా కనిపిస్తుంది. ఈ కారణంగా తమ్మిలేరు ఏటిగట్టు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు ప్రతినిత్యం దుర్గంధం మధ్యే నివసించాల్సిన దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనతో పాటు తూర్పు,పడమర లాకుల మరమ్మతులకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర వాసులు కోరుతున్నారు.

రెండు పాయలుగా తమ్మిలేరు

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు వద్ద నుంచి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు దగ్గరకు వచ్చే సరికి ఏలూరు–చింతలపూడి మార్గంలోని ఏలూరు ఎఫ్‌సీఐ గౌడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒక చీలిక తూర్పు వైపుగా ప్రవహించి తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు,రైల్వే ట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులోకి కలుస్తుంది. మరో చీలిక అశోక్ నగర్, అమీనాపేట, గ్లేవియర్ నగర్ మీదుగా నగరం మధ్య నుంచి కొత్త బస్టాండ్‌కు సమీపంలోని వంతెన దిగువగా ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.



పడమర లాకుల వద్ద పాడైపోయిన గేట్ వద్ద ఇసుక బస్తాలతో వేసిన అడ్డుకట్ట (ఫైల్)



పడమటి లాకుల వద్ద షట్టర్లు పాడైపోవడంతో మందగించిన నీటి ప్రవాహం



షట్టర్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న దృశ్యం

దిగువకు నీరు వెళ్లాలంటే ఇబ్బందులే

ఏలూరు నగరానికి తూర్పు, పడమర వైపు విస్తరించి ఉన్న లాకుల నుంచి వర్షాకాలం దిగువ కొల్లేరులోకి సాఫీగా వరద, వర్షం నీరు పోయేందుకు ఇబ్బందులు కన్పిస్తున్నాయి. పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని అన్ని వ్యర్థాలు నీటి ప్రవాహంతో పాటు కొల్లేరులోకి వెళుతూ ఉంటాయి. మిగిలిన రోజుల్లో వేసిన వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. వేసవిలో ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో లాకుల ముఖ ద్వారం వద్ద పెద్ద ఎత్తున మట్టితో కూడిన సిల్ట్, చెత్తాచెదారం పేరుకుపోయి ఎత్తు పెరిగిపోయి కన్పిస్తుంది. దీంతో వరదల సమయంలో వచ్చే నీరు ఇక్కడకు వచ్చేసరికి సాఫీగా కిందకు వెళ్లేందుకు అవకాశం ఉండదనే అభిప్రాయం ఉంది. చిన్నచిన్న పనులను కూడా ఇరిగేషన్ శాఖ చేయకపోవడంలో ఆ శాఖపూర్తి నిర్లక్ష్యం కన్పిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల వర్షాలకు తమ్మిలేరు ఉధృతంగా ప్రవహించడంతో ముందు ఊహించిన విధంగానే వరద నీరు దిగువకు సాఫీగా వెళ్లే విధంగా చేసేందుకు ఇరిగేషన్ అధికారులు నానా హైరానా పడాల్సి వచ్చింది. అదే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతుంది.

వైఎస్సార్ సీపీ హయాంలోనే వరద నివారణ పనులు

తమ్మిలేరు వరదలు కారణంగా ఏటా ఏలూరు నగరంలోనిపలు పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడం, ప్రజలు నానా అవస్థలు పడుతుండటం గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమ్మిలేరు వరద నివారణ చర్యలు తీసుకుంది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్‌మెంట్‌లు నిర్మించింది. దీంతో ఏలూరు నగర వాసులకు తమ్మిలేరు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాధారణ నిర్వహణ మాత్రమే. దీన్ని కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతూ కన్పిస్తుంది.

తమ్మిలేరు పూడికలను తొలగించాలి



తమ్మిలేరు వరద ప్రమాదం నుంచి ఏలూరు నగర ప్రజలను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. వేసవిలో ఎలాంటి నిర్వహణా కార్యక్రమాలు చేపట్టకుండా వరద నీరు ఉధృతంగా వచ్చే సమయాల్లో హడావుడి చేయడం పరిపాటిగా మారిపోయింది. తూర్పు, పడమర లాకుల వద్ద పెద్ద ఎత్తున మట్టి, చెత్త, చెదారం పేరుకుపోయి వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. వీటిని తొలగిస్తేనే వరద నీరు దిగువకు సాఫీగా వెళ్ళేందుకు అవకాశం ఉంటుంది.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

లాకుల మరమ్మతులు తక్షణం చేపట్టాలి



తమ్మిలేరు తూర్పు, పడమర లాకులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలి. తమ్మిలేరును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. దీనికి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. క్రమం తప్పకుండా ప్రతిఏటా తమ్మిలేరు పూడికతీతలను తీయాలి. తద్వారా వర్షాలు సమయంలో అధికంగా వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం వీలుగా ఉంటుంది.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, టీకేయంయూ

సీఐటీయూతో సోమయ్యకు సంబంధం లేదు

ఏలూరు (టూటౌన్): సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య ను సీఐటీయూ నుంచి తొలగిస్తూ సీఐటీయూ జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం తీర్మానించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ఒక ప్రకటన తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన సీఐటీయూ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సోమయ్య సీఐటీయూ పద్ధతులు, క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయనపై చర్య తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇకనుండి సీఐటీయూతో సోమయ్యకి ఎటువంటి సంబంధం లేదని, ఆయన చర్యలకు సీఐటీయూ బాధ్యత వహించదని కార్మికులంతా ఈ అంశాలు గ్రహించాలని కోరారు.

సంచార జాతులకు ప్రత్యేక గురుకులం ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): సంచార జాతుల విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని నవ్యాంధ్రప్రదేశ్ గిరిబలిజ సంక్షేమ సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ అన్నపరెడ్డి మురళి కోరారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ నందు సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సంచార జాతుల వారు విద్యారంగంలో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఘంటశాల వెంకటలక్ష్మి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వరరావు, ఘంటా ప్రసాదరావు, సంగర సంఘం అధ్యక్షులు తాడిశెట్టి గోపి, ముస్లిం సంచార జాతుల అధ్యక్షుడు జావీదు పాల్గొన్నారు.

ఘనంగా మద్ది రావమ్మ సంబరాలు

దెందులూరు: దెందులూరులో శ్రీమద్దిరావమ్మ సంబరాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీమద్దిరావమ్మ సంబరాలు ఐదు వారాల పాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సంబరాల్లో భాగంగా ఆదివారం గ్రామంలో అనేక గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు, పలు ఆలయాల కమిటీలు, దెందులూరు గణాచార్యులు, పండితులు, గ్రామస్తుల నడుమ నిప్పుల అగ్ని గుండం తొక్కి భక్తిని చాటుకున్నారు.

ఉద్యాన పంటలకు రాయితీ

ఉంగుటూరు: ఉద్యాన వన తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తోందని మండల ఉద్యానవన శాఖ అధికారి అమరనాథ్ వెల్లడించారు. మామిడి తోటలకు ఎకరాకు రూ.50 వేలు రాయితీ కల్పిస్తారని, మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండో సంవత్సరం రూ.20 వేలు అందజేస్తారని తెలిపారు. ఒక రైతు రెండున్నర హెక్టార్ల వరకు పరిమితమని చెప్పారు. జామకు రూ.80 వేలు, నిమ్మకు రూ.50 వేలు, కోకో పంటకు రూ.30 వేలు, సీతా ఫలానికి రూ.30 వేలు, టీసీ అరటికి రూ.70 వేలు, బొప్పాయికి రూ.30 వేలు, డ్రాగన్ పంటకు రూ.2.70 లక్షలు, వాక్కాయకు రూ.30 వేలు చొప్పున రాయితీ రెండేళ్లలో అందిస్తారని ఆయన తెలిపారు.

రొయ్య రైతులు ఉక్కిరిబిక్కిరి

- వైట్‌స్పాట్, విబ్రియో వ్యాధుల విజృంభణ
- క్షణాల్లో ఖాళీ అవుతున్న రొయ్యల చెరువులు

గణపవరం: ఈ ఏడాది రొయ్య రైతులకు కాలం కలిసి రాలేదు. వారి పరిస్థితి దెబ్బ మీద దెబ్బ అన్నట్లుంది. రెండు వారాల వ్యవధిలోనే కురిసిన భారీ వర్షాలు, అల్పపీడన ప్రభావం, ఆకాశం మేఘావృతమై వాతావరణం పూర్తిగా చల్లబడటంతో రొయ్య సాగుకు గండంగా పరిణమించింది. కలిసిరాని వాతావరణంలో వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో వందల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. సీడ్ వేసి నెల రోజులు కావడంతో కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదు. ప్రస్తుత వాతావరణం వైరస్ వ్యాధుల వ్యాప్తికి అనుకూలంగా మారడంతో విబ్రియో వైరస్, వైట్‌స్పాట్ వ్యాధులు విజృంభించాయి. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా 200 నుంచి 300 కౌంట్‌లో ఉన్న వేలాది ఎకరాల్లో రొయ్యలు అకస్మాత్తుగా పట్టేశారు. చెరువుల్లో సీడ్‌వేసి నెల రోజుల లోపే కావడంతో రొయ్య సైజు బాగా తక్కువగా ఉంది. 200 కౌంట్‌లో ఉన్న రొయ్య ధర కిలో రూ.100 నుంచి రూ.110 వరకూ ఉండగా, ఒకేసారి పెద్ద ఎత్తున ఈ కౌంట్ ఉన్న రొయ్యలు పట్టుబడి చేయడంతో వ్యాపారులు కిలోకు రూ.15 వరకూ తగ్గించేశారు. దీంతో ఎకరాకు లక్ష వరకూ నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 200 పైబడి కౌంట్ ఉన్న రొయ్య కొనే నాథుడు లేడు. గణపవరం, నిడమర్రు మండలాల పరిధిలో వైరస్ వ్యాపించడంతో గత నాలుగు రోజుల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో రొయ్యలు పట్టేశారు.

నష్టాల్లో రొయ్య రైతులు

జనవరి నుంచి ఇప్పటి వరకూ రొయ్య రైతులు రూపాయి లాభం ఎరుగరు సరికదా లక్షల్లో నష్టాలు చవిచూస్తున్నారు. వాతావరణంలో తీవ్రమైన మార్పులు, అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు, వ్యాధుల వ్యాప్తి ఈ ఏడాది ఆక్వా సాగును అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తూ ఆక్వా సాగుకు గండంగా మారాయి. వారం రోజుల నుంచి భారీ వర్షాలు, చల్లబడిన వాతావరణం కూడా ఆక్వా సాగుకు ప్రతికూలంగా మారింది. చెరువుల్లో నీటి ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా ఉండటంతో రొయ్యలకు ఆక్సిజన్ అందడం లేదు. దీంతో రైతులు ఆక్సిజన్ స్థాయిని పెంచడానికి నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నారు. చల్లని వాతావరణంలో వారం రోజులుగా వైరస్ కూడా విజృంభించడంతో రొయ్య రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఒక ఆయకట్టులో ఒక చెరువులో వైరస్ వ్యాధి కనిపిస్తే తెల్లారేసరికి ఆ ఆయకట్టులో ఉన్న అన్ని చెరువులకు వ్యాపిస్తుంది. చెరువుల్లో రొయ్య సీడ్ వేసి నెల రోజుల లోపే కావడంతో కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. రొయ్య సైజు మరీ చిన్నగా అంటే 250 నుంచి 300 కౌంట్ రొయ్యలు పట్టుబడి చేసినా కనీసం వల ఖర్చులు కూడా రావన్న ఉద్దేశ్యంతో రైతులు రొయ్యలు పట్టకుండా చెరువుల్లో బ్లీచింగ్ కలిపి వదిలేస్తున్నారు.



రొయ్యల చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు

సీడ్ నాణ్యత లోపంతోనే వైరస్



రొయ్య సాగులో సీడ్ నాణ్యత ముఖ్యం. సీడ్‌లో నాణ్యత లేకపోవడం వల్లనే వైరస్ వ్యాధులకు కారణం. ప్రస్తుత వాతావరణంలో వైరస్ వ్యాధుల దాడి తీవ్రంగా ఉంది. ఈ వైరస్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలంటూ ఏమీ లేవు. చెరువులు పట్టివేస్తే శుభ్రం చేసి పూర్తిగా ఆరగట్టి నవంబర్ తరువాత చెరువులో సీడ్ వేసుకోవాలి. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సూచించిన సపోరీ రిజిస్ట్రేషన్ ఉన్న హేచరీలకు చెందిన సీడ్ మాత్రమే వేసుకోవాలి.

– సి.భాస్కర్, ఫిషరీస్ సహాయకుడు, కల్లిగొట్ల



అర్థాంతరంగా పట్టివేసిన తక్కువ కౌంట్ రొయ్యలు



బ్లీచింగ్ చల్లి ఎండబెట్టిన రొయ్యల చెరువు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	38	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	46	కంద	00
కాకర కాయలు	32	బీట్‌రూట్	36
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

భీమడోలు: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల ఐదో రోజైన ఆదివారం గణనాథుని ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భీమడోలు, ఎం.నాగులపల్లి, పోలసానిపల్లి, కొల్లేరు గ్రామాల్లో భక్తులతో పూజలందుకున్న లంబోదరుని ట్రాక్టర్లపై ఊరేగించారు. భీమడోలు గణపతి సెంటర్‌లో శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు భక్తులకు తెల్లటి పాలమీగడ వర్ణంలో దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో సంప్రదాయబద్ధంగా స్వామివారు ప్రతి రోజూ ఒక వర్ణంలో భక్తులకు దర్శమిస్తారు. భీమడోలు జంక్షన్‌లోని శ్రీహరినగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మీ గణపతి స్వామి ఊరేగింపు, నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లోని వినాయక ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



భీమడోలు: ప్రత్యేక అలంకరణలో శ్రీమన్మహా గణనాథుడు

వైభవంగ గణేశుని ఊరేగింపు

దెందులూరు: భక్తి శ్రద్ధలతో నిమజ్జనాలు దెందులూరు వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం దెందులూరులో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. అందం వారి వీధిలో వినాయకుడి విగ్రహాన్ని, కాశీ కాలనీలో వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. యువత మహిళలు మేళతాళాలతో రంగుల చిమ్ముకుంటూ ఉత్సాహంగా విగ్రహాల ముందు నృత్యాలు చేశారు. అనంతరం గోదావరి కాలువలో గణపతి బప్పా మోరియా అంటూ నిమజ్జనం చేశారు. అందం వారి వీధి, కాశీ కాలనీ విగ్రహాలు నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా దెందులూరు ఎస్సై రాజమల్లు శివాజీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



దెందులూరు: నిమజ్జనానికి గణనాథులను తీసుకెళుతున్న భక్తులు

టోలు ప్లాజా స్టాఫ్ ఆధ్వర్యంలో..

ఉంగుటూరు: ఉంగుటూరు టోలు ప్లాజా సిబ్బంది ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం ఊరేగించారు. ఈ సందర్భంగా రంగులు పూసుకుని డ్యాన్సులు వేస్తూ ఊరేగింపులో టోలు ప్లాజా ఉద్యోగులు పాల్గొన్నారు. టోలు మేనేజర్ ఇంతియాజ్, టీఎంటీ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గోదావరి కాలువలో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.